జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మిర్యాలగూడ/మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 26 : ఈ నెల 30 వరకు పంజాబ్ రాష్ట్రంలోని సంగూరు జిల్లా కేంద్రంలో నిర్విహించే జాతీయ బేస్ బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు తెలంగాణ బేస్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరావతి సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8,9,10 తేదీల్లో జగిత్యాల పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ మహిళల పోటీల్లో జిల్లా జట్టు తరపున ఆడిన వెన్నెల, తేజశ్రీ, ఈ నెల 13,14,15 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగిన సీనియర్ మెన్స్ విభాగంలో పురుషుల విభాగంలో చిర్ర మల్లేశ్, కొరుపోలు రవి ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డికి సన్మానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సురేశ్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 26 : గత 20 ఏళ్లుగా యాదగిరిగుట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డిని పీఏసీఎస్ కొత్త భవనంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వంటేరు సురేశ్‌రెడ్డి గురువారం సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సెక్రటరీ బండ బాలసిద్ధులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కానుగంటి శేఖర్‌రెడ్డి, శ్రీలోగిళ్లు డెవలపర్స్ డైరక్టర్ ప్రభాకర్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు సొప్పరి మహేందర్, మైలారం స్వామి, విజయ్ పాల్గొన్నారు.

29న హైదరాబాద్‌లో బ్రాహ్మణ మహా సమ్మేళనం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

రామగిరి, డిసెంబర్ 26: బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న హైదరాబాద్‌లో బ్రాహ్మణ మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు తెలిపారు. సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను గురువారం నల్లగొండలోని రామగిరి సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీంద్రభారతిలో జరిగే సమ్మేళనానికి అధిక సంఖ్యలో బ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిప్రగడ శ్రీనివాసశర్మ, కోశాధికారి రంగరాజు జగదీశ్‌శర్మ, రామరాజు శరత్, నేవర్సు నీరజ, నరసింహారావు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో వామపక్షాల నిరసన

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

రామగిరి, డిసెంబర్ 26: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యసభలో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో జరిగిన పార్టీ మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్ షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయమై స్పందించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నారి ఐలయ్య, ముద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పి.నర్సిరెడ్డి, సలీం, సత్తయ్య పాల్గొన్నారు.

పుడమిరత్న అవార్డుకు లిటిల్ సోల్జర్స్ ఎంపిక

నకిరేకల్, డిసెంబర్ 10 : నకిరేకల్ పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికైనట్లు పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 సంవత్సరాలుగా చిన్నారుల వైద్యానికి సాయం అందించడంతో పాటు, నిరుద్యోగులకు ఉచిత స్టడీహాల్, అనాథాశ్రమాలకు, నిరుపేదలకు చేయూత అందించడం, రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు అందించినందుకు గానూ సంస్థను అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అవార్డు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్ మాట్లాడుతూ అందరి సహకారంతో తాము సేవా కార్యక్రమాలు అందించామన్నారు. తమ సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన పుడమి సాహితీవేదిక వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ దరఖాస్తులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలి : డీవైఎఫ్ఐ

చిట్యాల, డిసెంబర్ 26 : ఉద్యోగ దరఖాస్తులపై కేంద్రం విధిస్తున్న జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జిట్ట రమేశ్, వడ్డగాని మహేశ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం చిట్యాలలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు నరేశ్, నాయకులు అవిశెట్టి కిరణ్, జిట్ట సురేశ్, జోగు గణేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 24 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.

NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు సన్నద్ధం

- ఈ నెల 30,31 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహణ
- విజ్ఞాన శాస్త్రం -సాంకేతిక అభివృద్ధిపై ప్రాజెక్టులకు అవకాశం
- వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు

రామగిరి, డిసెంబర్ 26: విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమైంది. ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా కేంద్రంలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. 'సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర ' ప్రధానాంశంతో పాటు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులకు (2023-24)ఎంపికైన 113 ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదర్శనకు సూచించిన అంశాలల్లో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యత కల్పించనున్నట్లు డీఈఓ బి.భిక్షపతి వెల్లడించారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయిలోకి పంపిస్తారు. వైజ్ఞానిక ప్రదర్శన చైర్మన్‌గా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా డీఈఓ, సభ్యులుగా డైట్ ప్రిన్సిపాల్, జిల్లా సైన్స్ అధికారితోపాటు పలువురు ఉన్నారు.

శాస్త్ర సాంకేతిక నైపుణాల అభివృద్ధికే

విద్యార్థుల్లో విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక అంశాల్లోని నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభకు పదునుపెట్టేందుకు ప్రతి సంవత్సరం సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. ఇందులో విద్యాశాఖ సూచించిన ప్రధానాంశంలోని ఉప అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులను తీసుకొచ్చి ప్రదర్శించాల్సి ఉంటుంది. పాఠశాల దశ నుంచి సైన్స్, గణితం సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా విద్యార్థులను తయారుచేయడంతో ఈ ప్రదర్శన ఎంతో దోహదం చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రదర్శనలోని అంశాలు ఇవే..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రధానాంశంగా 'సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర' ఉండగా ఇందులో ఆహారం, ఆరోగ్యం - పరిశుభ్రత, రవాణా సమాచార రంగం, వ్యవసాయం, సేంద్రియ పద్ధతులు, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, కాంపిటేషనల్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ వంటి ఏడు ఉప అంశాలు ఉన్నాయి. ఆయా విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన ప్రదర్శనల్లో జూనియర్స్ నుంచి 7, సీనియర్స్ నుంచి 7 ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి పంపిస్తారు. దాంతో పాటు విద్యార్థులకు వివిధ అంశాలల్లో సెమినార్లు, వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తారు. వీరితోపాటు డీఈడీ, బీఈడీ కళాశాలల ఛాత్రోపాధ్యాయులు టీచింగ్ మోడల్స్ కూడా ప్రదర్శించనున్నారు.

113 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన

జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ఆయా ఉప అంశాల్లోని ప్రాజెక్టుల ప్రదర్శనతో పాటు 2023-24 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మానక్ అవార్డులకు వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 113 ప్రాజెక్టులను కూడా ప్రదర్శించనున్నారు. సైన్స్‌ఫెయిర్ ప్రారంభోత్సవానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

ఉత్తమ ప్రాజెక్టుల కోసం విద్యార్థులను ప్రోత్సహించాలి

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నాం. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల తయారీకి సంబంధించి ఆయా పాఠశాలల సైన్స్, గణిత ఉపాధ్యాయులకు శిక్షణ అందించాం. 7 ఉప అంశాలల్లో ఉత్తమైన అధిక సంఖ్యలో ప్రాజెక్టులు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చూడాలి. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకారం అందించాలి. మన జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లి అక్కడ తమ ప్రదర్శనలు ఇచ్చేలా చూడాలి.ఈ విషయమై పూర్తి సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని సంప్రదించాలి.

- బి.భిక్షపతి, డీఈఓ-నల్లగొండ

నేడు బెటాలియన్‌లో కానిస్టేబుల్స్ దీక్షాంత్ పరేడ్

నీలగిరి, డిసెంబర్ 26 : ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్ దీక్షాంత్ పరేడ్‌ను ఈ నెల 27న 12వ బెటాలియన్‌లో నిర్వహించనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టేట్ పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 450 మంది (వికారాబాద్ జిల్లా నుంచి 107, కామారెడ్డి జిల్లా నుంచి 129, రామగుండం నుంచి 214 మంది) 12వ బెటాలియన్‌లో కఠోరమైన ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పీఅండ్ఎల్ ఐజీ ఎం.రమేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు. తొమ్మిది నెలల శిక్షణ కాలంలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

జూనియర్ బాలుర కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

హాలియా, డిసెంబర్ 26 : జూనియర్ బాలుర కబడ్డీ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి 30 వరకు జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

పి. భరత్ (కెప్టెన్), గర్నేకుంట గ్రామం, సీహెచ్ గణేశ్ (మిర్యాలగూడెం), ఎం. గిరి (గుడిపల్లి), పి. రాజు (పాల్తీ తండా), ఎస్, శ్రీపాదం (పెద్దగట్టు), డి.మధు (అనుముల), జి.వేణు (ఇబ్రహీంపేట), కె.రాకేశ్ (మదారిగూడెం), సీహెచ్ హన్మంత్ (వెల్మగూడెం), ఆర్. శివ (కొదండాపురం), కె. అనిల్ (వెల్మగూడెం), ఎన్.వెంకటేశ్(తుంగతుర్తి), ఎస్కే వహీద్ (తడకమల్ల), టీం కోచ్‌గా కె. సైదులు, టీం మేనేజర్‌గా సత్యనారాయణ ఎంపికయ్యారు.

మాజీ ఎంపీటీసీ మృతికి రవీంద్రకుమార్ సంతాపం

చందంపేట, డిసెంబర్ 26 : మండలంలోని ముడుదండ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సీపీఐ గ్రామ కార్యదర్శి పందిరి జనార్దన్‌రెడ్డి గురువారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ గ్రామానికి వెళ్లి జనార్దన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో దామెర శ్రీను, బాలవద్దిరాజు, మురళి, నిరంజన్, యాదయ్య, నర్సింహ, శ్రీను ఉన్నారు.

చెర్వుగట్టులో భక్తులకు వసతులు కల్పించాలి

నార్కట్‌పల్లి, డిసెంబర్ 26 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని హిందూ దేవాలయ పరిరక్షణ సమితి సభ్యుడు యాట చంద్రశేఖర్ ముదిరాజ్ అధికారులను కోరారు. గురువారం చెర్వుగట్టు ఆలయాన్ని ఆయన సందర్శించి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి అమావాస్య నాడు ఆలయానికి లక్షల మంది భక్తులు వస్తారని, మరుగుదొడ్లు, మహిళలు బట్టలు మార్చుకునే గది లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కోనేటిలోని నీటిని ప్రతి రోజు మార్చాలని, తాగునీటి వసతి కల్పించాలని కోరారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చాణక్య

పురుగుల మందు పిచికారీతోనే కల్లు కలుషితం

- కల్తీ కల్లు విక్రయించిన వ్యక్తిపై కేసు

శాలిగౌరారం, డిసెంబర్ 26 : ఈత చెట్టుకు పురుగు పట్టిందని చెట్టు మొగిళ్లలో క్రిమిసంహారక మందును(మోనోక్రొటోపాస్) పిచికారీ చేయడం వల్లే కల్లు కలుషితమైందని, కల్తీ కల్లు తాగి ఆరుగురు తీవ్ర అస్వస్థకు గురైన ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గురువారం నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. చాణక్య కేసు వివరాలను వెల్లడించారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన గీతకార్మికుడు పల్స వెంకన్న ఈ నెల 22న ఈత చెట్టుకు పురుగు పట్టిందని, దాంతో చెట్టు చనిపోతుందని భయపడి చెట్టు మొగిళ్లలో క్రిమిసంహారక మందును పిచికారీ చేశాడు. ప్రస్తుతం కురుస్తున్న మోస్తరు వర్షానికి మొగిలిలో పోసిన క్రిమిసంహారక మందు కిందికి కారి చెట్టుకు కట్టిన లొట్టిలో పడింది. అది గమనించని గీత కార్మికుడు బుధవారం గ్రామానికి చెందిన ఆరుగురికి అదే కల్లును పోశాడు. పురుగుల మందు కలిసిన కల్లు తాగిన గ్రామస్తులు అస్వస్థతకు గురైనట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై గురువారం పెర్కకొండారం గ్రామానికి శాలిగౌరారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వెళ్లి విచారణ చేపట్టడంతో ఈ విషయం తెలిసింది. బాధితుడు వెంకన్న నుంచి క్రిమిసంహారక మందు, లీటర్ కల్లు, కల్లు కుండ, ప్లాస్టిక్ బాటిల్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. పల్స వెంకన్నపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

ఒకరి పరిస్థితి విషమం

కల్తీకల్లు తాగిన బాధితుల్లో ఒకరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. మిగతా ఐదుగురు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితుల్లో ఒకరు డిశ్చార్జి కాగా పిచ్చయ్యకు రక్త కణాలు తగ్గినట్లు, ప్రస్తుతం దవాఖానలోనే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నకిరేకల్‌లో చికిత్స పొందుతున్న నలుగురిలో భిక్షంను మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ధూప,దీప, నైవేద్య అర్చక సంఘం మిర్యాలగూడ కార్యవర్గం

మిర్యాలగూడ : ఈ నెల 29న నిర్వహించే బ్రాహ్మణ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ కోరారు. గురువారం పట్టణంలోని వినాయక ఆలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం మిర్యాలగూడ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చిట్యాల శ్రీనివాసశర్మ, ప్రధాన కార్యదర్శిగా బద్రివాద మహేశ్‌శర్మ, ఉపాధ్యక్షులుగా కొడవగంటి సాయిబాబాశర్మ, భూక్యా సేవా, కోశాధికారిగా గొట్టేటి గాయత్రీవర్మశర్మ, ప్రచార కార్యదర్శిగా పంచాంగం శేషాచార్యులు, గౌరవ సలహాదారులుగా ఉగ్రదండి హరిప్రసాద్‌శర్మను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పైడిమర్రి ప్రసాద్‌శర్మ, సురేశ్‌శర్మ, లక్ష్మీనర్సయ్యశర్మ, భవన్నారాయణశర్మ, రామ్మూర్తిశర్మ, పద్మనాభశర్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- డీఎస్పీ శివరాంరెడ్డి

రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి, డిసెంబర్ 26 : హైవేపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఎస్పీ కె. శివరాంరెడ్డి ఆదేశించారు. గురువారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను, సిబ్బంది కిట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పెట్రోలింగ్ పెంచాలన్నారు. నిత్యం వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. ఆయన వెంట శాలిగౌరారం సీఐ కె.కొండల్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న మార్కెట్ చైర్మన్ సత్యం

నిడమనూరు, డిసెంబర్ 26 : మండలంలోని శాఖాపురం గ్రామానికి చెందిన నల్లగంతుల దుర్గయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.23,500 చెక్కును గురువారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం తన చాంబర్‌లో అందించారు. కార్యక్రమంలో నాయకులు మేరెడ్డి వెంకటరమణ, కంచి పాపయ్య, మోసాల శ్రీను, షేక్ అజ్మత్, పోలె ఇసాకు పాల్గొన్నారు.

పాల్వాయి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతకు అడ్డుగా పెట్టిన బారికేడ్

గుంతలమయంగా నల్లగొండ-దేవరకొండ రోడ్డు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహన దారులు
- పట్టించుకోని అధికారులు

రామగిరి, డిసెంబర్ 26 : నల్లగొండ నుంచి దేవరకొండకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొండమల్లేపల్లి నుంచి నల్లగొండ వరకు గుర్రంపోడు, కొప్పోలు, పర్వతగిరితోపాటు పలు ప్రాంతాల్లో రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడ్డాయి. గుర్రంపోడు మండలం పాల్వాయి సమీపంలో రెవెల్లికి గ్రామానికి వెళ్లే మార్గం వద్ద రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఒకే చోట దగ్గర దగ్గరగా గుంతలు పడటంతో వాహన దారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయితే గుంతలను పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు కేవలం గుంతకు అడ్డంగా బారికెడ్‌ను ఉంచి చేతులు దులుపుకున్నారు. దాంతో వచ్చి పోయే వాహదారులు వేగంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నల్లగొండలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నెల్లికంటి సత్యం

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే

- సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం

మునుగోడు/రామగిరి, డిసెంబర్ 26 : సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టులదే అని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండ, మునుగోడులో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లి దేశ సంపదని అదానీ, అంబానీ వంటి కార్పొరేటు వర్గాలు దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారికి ఉపయోగపడే విధంగా పరిపాలన సాగిస్తుందన్నారు. ఈ నెల 30న నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించే శత వార్షికోత్సవ సభకు కమ్యూనిస్టులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, నాయకులు లెనిన్, ముత్యాలు, రమ, సుజాత, జమీల్, మునుగోడులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చలపతి పాల్గొన్నారు.

మిర్యాలగూడ : పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జెండాను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ.సయ్యద్, సహాయ కార్యదర్శి అంజనపల్లి రామలింగం, నాయకులు వల్లంపట్ల వెంకన్న, ఎర్రబోతు పద్మ, లింగంపల్లి వెంకన్న, రహీం పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న హరికృష్ణ

చిట్యాల, డిసెంబర్ 26 : ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని వట్టిమర్తిలోని సాయిబాబా ఆలయం వద్ద యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ ఆలయ మాజీ చైర్మన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, సంస్థ అధ్యక్షుడు హరికృష్ణ ప్రతినిధులు కృష్ణారెడ్డి, గడగోజు ఎల్లాచారి, జాల నరేశ్, ఓర్సు శ్రీధర్, అంజనపల్లి శివసాయి పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి

సమావేశంలో మాట్లాడుతున్న బక్కా శ్రీనివాసచారి

మిర్యాలగూడటౌన్, డిసెంబర్ 26: ఈ నెల 28 నుంచి 30 వరకు నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసచారి కోరారు. గురువారం పట్టణంలోని టీచర్స్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే మహాసభల్లో విద్యారంగంలో అసమానతలు, అంతరాలు లేకుండా ఉండేందుకు తీసుకోవల్సిన చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. మహాసభల్లో పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, సీపీఎస్ రద్దు, 317జీఓ బాధితులకు న్యాయం చేసే అంశాలపై కూడా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, జిల్లా కార్యదర్శులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, చిన వెంకన్న, పెన్షనర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎల్.అరుణ, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

- డీఎస్పీ రాజశేఖర్‌రాజు

పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, డిసెంబర్ 26 : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆదేశించారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి మాట్లాడారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న టూటౌన్ సీఐ పి.నాగార్జున, ఎస్ఐలు బి.రాంబాబు, డి.హరీశ్‌రెడ్డిని డీఎస్పీ అభినందించారు.

ఆర్థిక సాయం

చందంపేట, డిసెంబర్ 26 : మండలంలోని ముడుదండ్ల గ్రామానికి చెందిన సైదయ్య కాలు విరగడంతో ఇంటివద్దే చికిత్స పొందుతున్నాడు. బీఆర్ఎస్ నాయకుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి గురువారం ఆయనను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట రఘుమారెడ్డి, దామెర శ్రీను, అన్నెపాక నిరంజన్, మురళి, కృష్ణయ్య, యాదయ్య, జంగయ్య, అనిల్, శ్రీను పాల్గొన్నారు.